RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 425 | 17 శుక్రవారం జులై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా
# సుభిక్షంగా ఉండాలి
### : పవన్ కల్యాణ్



పవిత్రమైన పూరీ జగన్నాథుని రథయాత్రను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా, శాంతిసంతోషాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ఒక భక్తిపూర్వక సందేశాన్ని పంచుకున్నారు.పవిత్రమైన ఈ రథయాత్ర అనేది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని.. అది అచంచలమైన విశ్వాసానికి, భక్తికి, అలాగే భగవంతునికి, భక్తుడికి మధ్య ఉండే శాశ్వతమైన ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. పవిత్ర రథాలపై స్వామివారు, అమ్మవారు ముందుకు సాగుతుండగా... ఆ జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవిల దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరి హృదయానికి శాంతిని, ప్రతి కుటుంబానికి మానసిక బలాన్ని, ప్రతి జీవితానికి సరికొత్త ఆశను ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఆ కలియుగ దైవం మనందరినీ ఎల్లప్పుడూ ధర్మమార్గంలో నడిపించి, మన ఇళ్లను సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో నింపాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. దీనితో పాటు, సమాజానికి వినమ్రతతో, నిష్కల్మషమైన భక్తితో సేవ చేసేలా.. మనందరికీ అవసరమైన జ్ఞానాన్ని, ధైర్యాన్ని ఆ స్వామి ప్రసాదించాలని కోరారు. ఈ పవిత్రమైన రోజున జగన్నాథుని దివ్య అనుగ్రహం మన జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపి, శాంతి, ఐక్యత, ఆధ్యాత్మిక బలంతో కూడిన ఒక ఉన్నతమైన భవిష్యత్తు వైపు మన సమాజాన్ని నడిపించాలని ఆకాంక్షించారు.

## పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే
# శుభవార్త
### : సీఎం రేవంత్ రెడ్డి



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి త్వరలోనే శుభవార్త వింటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో 'అమర రాజా గ్రూప్' నెలకొల్పిన తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒప్పించి, అవసరమైన అనుమతులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని ప్రకటించారు. అదేవిధంగా, డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపులపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.కృష్ణా బేసిన్ పరిధిలోని దిండి, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యతను తాను స్వీకరిస్తానని సీఎం హామీ ఇచ్చారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నిలిపి, ఒక ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపన కోసం భూములిచ్చిన రైతులకు తగిన న్యాయం జరగాలని, అలాగే స్థానిక యువతకే గరిష్ఠ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలని యాజమాన్యానికి సూచించారు.అంతకుముందు, అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన 'కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్' తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పర్యావరణ మార్పుల నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని, ఈ తరుణంలో బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఇక్కడ స్థాపించడం ముదావాహమని పేర్కొన్నారు. స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి కల్పిస్తున్న అమర రాజా సంస్థ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికను రూపొందించామని, పారిశ్రామిక విధానాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చామని సీఎం వివరించారు. అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడుతూ అమరరాజా గ్రూప్ దేశానికి గర్వకారణంగా నిలుస్తోందని ఆయన ప్రశంసించారు.

# గ్రేటర్‌లో మొదలైన ఆషాఢ బోనాల సంబురాలు..
### శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోని వేలాది ఆలయాల్లో ఆషాఢ బోనాల జాతర కోలాహలంగా ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నాడు హైదరాబాద్‌లో ఈ వేడుకలు ఘనంగా అంకురార్పణ చేసుకున్నాయి.బోనాల పండుగ సామాజిక ఐక్యతకు నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. ఆలయ ప్రాంగణాల్లో పారిశుధ్యం, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలతో పాటు పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.మహంకాళి అమ్మవారికి అంకితం చేసే ఈ బోనాల ఉత్సవాలను దేవాదాయ శాఖ పరిధిలోని 3 వేలకు పైగా ఆలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆగస్టు మధ్య వరకు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ముఖ్యమంత్రి కోరారు.భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అధికారులు ఇప్పటికే సమీక్షలు నిర్వహించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ఏడాది పలు ఇతర మున్సిపల్ కార్పొరేషన్లకు కూడా ఈ ఉత్సవాలను విస్తరించడం విశేషం.

# వైభవంగా గోల్కొండ బోనాల జాతర ప్రారంభం..
### బోనం ఎత్తిన కొండా సురేఖ



భాగ్యనగర సంస్కృతికి నిలువుటద్దంగా నిలిచే చారిత్రాత్మక గోల్కొండ కోటలో ఆషాఢ మాస బోనాల జాతర అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య ప్రారంభమైంది. ఈరోజు లంగర్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్.. మంత్రి కొండా సురేఖకు సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తడం విశేషంగా నిలిచింది.శ్రీ గోల్కొండ జగదాంబికా మహంకాళి ఎల్లమ్మ అమ్మవారికి ప్రభుత్వ పక్షాన మంత్రులు అధికారికంగా పట్టువస్త్రాలు, మొదటి 'బంగారు బోనం' సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ. 11 లక్షల రూపాయల ప్రభుత్వ చెక్కును ఆలయ కమిటీకి అందజేశారు.ఉత్సవాల ప్రారంభం సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతురాజుల వీర విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో లంగర్ హౌస్ పరిసర ప్రాంతాలన్నీ భక్తి పారవశ్యంతో ఊగిపోయాయి. ఈ వేడుకను కళ్లారా చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆషాఢ బోనాల జాతరకు గోల్కొండ కోట తొలి వేదిక కావడంతో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. నగర నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ఎక్కడికక్కడ భారీ బందోబస్తును మోహరించారు. ఎబందోబస్తును మోహరించారు.

## ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను
# గాలికి వదిలేశారు
### : బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్



ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఈరోజు ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు.గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు."గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

# హిందువులపై దాడులు జరిగితే సహించం
### : ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి హెచ్చరిక



హిందువులందరూ ఐక్యంగా ఉంటూ, సమాజంపై దాడులు జరిగినప్పుడు సమష్టిగా స్పందించి భవిష్యత్తును కాపాడుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ కేంద్రంలో గురువారం ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హిందూ సమాజంపై ఎక్కడ దాడి జరిగినా, అందరూ ఏకమై నిరసనలు, ఉద్యమాల ద్వారా సమర్థంగా ప్రతిఘటించాలని ఆయన సూచించారు.గతంలో చోటుచేసుకున్న కొన్ని ఘటనలను ప్రస్తావిస్తూ, పిప్రిలో ఒక హిందువు ఇంటిని తగులబెట్టినప్పుడు సమాజం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర వర్గాలకు చెందిన వ్యక్తులపై చిన్న దాడి జరిగినా వేలాదిగా తరలివచ్చే పరిస్థితి ఉందని, హిందువుల్లోనూ అదే తరహా ఐక్యత రావాలని ఆకాంక్షించారు. హిందువులు సంఘటితంగా లేకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇకపై హిందువులపై జరిగే దాడులను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆర్మూర్‌లో ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి మున్సిపాలిటీ తరఫున ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తామని రాకేశ్ రెడ్డి ప్రకటించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఫైలుపై సంతకం చేసిన వెంటనే, మందిరం నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు.

# నేడు రాష్ట్ర క్యాబినెట్ భేటీ



రాష్ట్ర క్యాబినెట్ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. క్యాబినెట్ భేటీకి సంబంధించిన ఎజెండా ఏంటనేది బహిర్గతం చేయలేదు. కనీసం మంత్రులకు కూడా ఎజెండా ఏంటనే విషయం తెలియదని సమాచారం. పలు ప్రాజెక్టులకు సంబంధించి క్యాబినెట్‌లో చర్చించే అవకాశం ఉన్నట్లుగా తెలిసింది. ఎల్‌నినో ప్రభావంతో సాగు, తాగు నీళ్లకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదమున్నది. ఈ పరిస్థితుల నుంచి గట్టేక్కేందుకు తీసుకోవాల్సిన చర్యలపై క్యాబినెట్‌లో చర్చించే అవకాశమున్నది. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపైనా క్యాబినెట్‌లో చర్చించి అవకాశమున్నది.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
17 శుక్రవారం జూలై 2026

# సబ్ స్టేషన్ ముందు రైతుల ఆందోళన



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)
మండల కేంద్రంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న రైతులు సబ్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగడం జరిగినది అనంతరం రైతులు అధికారులను ప్రస్తుత పరిస్థితిలో కరెంటు సరిగా రాకపోవడం ఎందుకు అని నిలదీయగా నిర్లక్ష్య ధోరణితో సమాధానం చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు లో వోల్టేజ్ సమస్యతో కరెంటు మోటార్లు నడవక వేసిన వరి పొలాలు ఎండిపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో అయోమయానికి గురవుతున్నారు ఏలినోవా ప్రభావంతో సరైన సమయంలో వర్షాలు పడకపోవడంతో పంట లు ఎండుతున్నాయి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సక్రమంగా 24 గంటల కరెంటు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులకు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 16:-
ఇబ్రహీంపట్నం గ్రామపంచాయతీ ఆవరణలో జూలై 17న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బుడిదె రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే లక్ష్యంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు స్త్రీల ఆరోగ్య సమస్యలు, పిల్లల వైద్య సేవలు, ఆర్థోపెడిక్, నేత్ర వైద్య పరీక్షలు, రక్తపోటు, షుగర్ పరీక్షలు, ఉచిత వైద్య సలహాలు అందించనున్నారు. అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు తదుపరి చికిత్సపై మార్గనిర్దేశం చేయనున్నారు. పయనీర్ హాస్పిటల్స్, రష్‌కేర్ హాస్పిటల్, సదూరం కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొని సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్య పరిస్థితిని పరీక్షించుకోవాలని, కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని రామ్‌రెడ్డి కోరారు. అన్ని వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందించబడతాయని నిర్వాహకులు తెలిపారు.

## యువత మై భారత్‌లో నమోదు కావాలి
### : అదనపు కలెక్టర్ కిరణ్మయి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 16:-
రంగారెడ్డి జిల్లాలో "మై భారత్‌విక్సిత్ భారత్" యువజన నమోదు, అవగాహన కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం అధికారిక ప్రచార పోస్టర్‌ను విడుదల చేసింది. జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి ఐఏఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవ, నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ వికాసం వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, విక్సిత్ భారత్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ బసుత్కర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని యువతలో నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించి, ఎక్కువ మందిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఇందుకోసం విద్యాసంస్థలు, యువజన సంఘాలు, వాలంటీర్ల సహకారంతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మై భారత్ సిబ్బంది, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రూ.27 లక్షలతో డ్రైనేజీ పనులకు శ్రీకారం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 16:-
తొర్రూర్ డివిజన్ పరిధిలోని కమ్మగూడ టీచర్స్ కాలనీ, వినాయక హిల్స్ ప్రాంతాల్లో రూ.27 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు జీహెచ్ఎంసీ తొర్రూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్, తుర్కయాంజల్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కోశికె ఐలయ్య భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామిరెడ్డి సహకారంతో ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ప్రగతి నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించనున్న కిచెన్ షెడ్ పనులకు కూడా కోశికె ఐలయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, వెంకట్రావు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, కాలనీ అధ్యక్షులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజంపై పోలీసుల అవగాహన సదస్సు.

హైదరాబాద్ స్టేట్ మద్దిరాల (ప్రతినిధి )
సమాజానికి పెను సవాలుగా మారిన మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి ప్రజలు, యువత అంతా దూరంగా ఉండాలని మద్దిరాల సబ్ ఇన్‌స్పెక్టర్ వీరన్న పిలుపునిచ్చారు. గురువారం మద్దిరాల మండల కేంద్రంలోని క్రాస్ రోడ్ వద్ద స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు మరియు యువతకు డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిరాల ఎస్‌ఐ మాట్లాడుతూ.. క్షణికానందం మరియు సరదా కోసం అలవాటు చేసుకునే మాదకద్రవ్యాల తీవ్రత వల్ల వ్యక్తిగత జీవితాలతో పాటు వారి కుటుంబాలు, సమాజం ఏ విధంగా సర్వనాశనమవుతాయో ప్రజలకు సమగ్రంగా వివరించారు. డ్రగ్స్ బారిన పడి బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దని హితవు పలికారు. ముఖ్యంగా యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా పోరాడాలని, తమ స్నేహితుల్లో, కుటుంబాల్లో మరియు చుట్టుపక్కల వారిలో దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించి చైతన్యపరచాలని కోరారు. మండల పరిధిలో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా లేదా విక్రయాలు జరుపుతున్నట్లు తెలిసినా వెంటనే మద్దిరాల పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మీరా,




సమీరా వెంకన్న మరియు యువకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోల్కొండలో తొలి బోనంతో బోనాల వైభవానికి శ్రీకారం

### వేలాది మంది భక్తుల నడుమ ఘనంగా ప్రారంభమైన ఆషాఢ ఉత్సవాలు
### జగదాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు
### ఆలయానికి రూ.11 లక్షల ప్రభుత్వ నిధులు





హైదరాబాద్, జూలై 16 హైదరాబాద్ ఎస్టేట్:
తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల ఉత్సవాలు గురువారం గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేలాది మంది భక్తుల భక్తి శ్రద్ధల మధ్య డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో గోల్కొండ కోట పండుగ శోభను సంతరించుకుంది. అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి జగదాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీకి ప్రభుత్వం తరఫున రూ.11 లక్షల ఆర్థిక సహాయ చెక్కును అందజేశారు. సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాఢ బోనాల ఉత్సవాల బుక్‌లెట్‌ను కూడా ఆవిష్కరించారు. ఉత్సవాల్లో జానపద కళారూపాలు, సంప్రదాయ వాయిద్యాల నాదం, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల ఆధ్యాత్మిక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులతో మమేకమైన మంత్రి కొండా సురేఖ వారి ప్రదర్శనలను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జగదాంబిక అమ్మవారి అనుగ్రహంతో ఎల్‌నినో ప్రభావం తగ్గి రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, తెలంగాణ మరింత సుభిక్షంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. పెద్ద దేవాలయాలతో పాటు చిన్న ఆలయాల అభివృద్ధికీ నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యం లేకుండా అమ్మవారిని దర్శించుకునేలా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మామ్నూరు ఎయిర్‌పోర్టు క్రెడిట్ బీఆర్ఎస్‌దే.. కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం: మాజీ ఎమ్మెల్యేలు

### భూసేకరణ, రన్‌వే విస్తరణ, కేంద్రంతో సంప్రదింపులన్నీ బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని స్పష్టీకరణ..
### కాంగ్రెస్ వ్యాఖ్యలపై మండిపాటు



హనుమకొండ, జూలై 16 హైదరాబాద్ ఎస్టేట్:
మామ్నూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, నన్నపనేని నరేందర్ విమర్శించారు. ఎయిర్‌పోర్టు విస్తరణకు అవసరమైన భూసేకరణ, రన్‌వే విస్తరణ ప్రణాళిక, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు, పరిపాలనా ప్రక్రియలన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, మామ్నూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం మాజీ మంత్రి కేటీఆర్ పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ ప్రతినిధులతో చర్చలు జరిపారని తెలిపారు. ఉడాన్ పథకం కింద కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరిపి, రన్‌వేను 1.8 కి.మీ నుంచి 3.8 కి.మీకి విస్తరించే ప్రణాళికతో రైతులను ఒప్పించి భూసేకరణ చేపట్టామని చెప్పారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, ప్రజా ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ, ఎయిర్‌పోర్టు విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేబినెట్ ఆమోదం లభించిందని గుర్తు చేశారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం రూ.500 కోట్లతో భూసేకరణ చేపట్టామని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకోవడం సరికాదన్నారు. దేశాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ మామ్నూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ, మామ్నూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాలు, భూసేకరణ ప్రక్రియ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని పేర్కొన్నారు. వాస్తవాలను పక్కనబెట్టి రాజకీయ ఆరోపణలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచిస్తూ, మామ్నూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వమే పునాది వేసిందని పునరుద్ఘాటించారు.

# సీసీ కెమెరాలతో దేవాలయాన్ని ఢీకొట్టిన వాహనం గుర్తింపు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 16:-
రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తలకొండపల్లి పోలీస్ స్టేషన్ పోలీసులు సీసీ కెమెరాల సాయంతో దేవాలయాన్ని ఢీకొట్టి పరారైన వాహనం, డ్రైవర్‌ను వేగంగా గుర్తించారు. తలకొండపల్లి గ్రామ శివారులోని దేవకి గార్డెన్ సమీపంలో ఉన్న శ్రీ కాళికా మాత దేవి ఆలయ ప్రహరీ గోడను జూలై 15 అర్ధరాత్రి సమయంలో ఓ వాహనం ఢీకొనడంతో గోడలు దెబ్బతిన్నాయి.
ఘటనపై స్థానికుడు పెరమండ్ల జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ వి. జానకి రామ్ రెడ్డి ఆదేశాల మేరకు క్రైమ్ సిబ్బంది పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని సేకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. దర్యాప్తులో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, దానిని నడిపిన వ్యక్తిని గుర్తించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మిడ్జిల్ మండలం వేముల గ్రామానికి చెందిన కేంగురి రాఘవేందర్‌గా పోలీసులు నిర్ధారించారు. సాంకేతిక ఆధారాలతో తక్కువ సమయంలోనే కేసును ఛేదించిన క్రైమ్ కానిస్టేబుల్ జాషువాను ఇన్‌స్పెక్టర్ వి. జానకి రామ్ రెడ్డి, ఎస్సై కె. శేఖర్‌తో పాటు స్థానిక గ్రామస్థులు అభినందించారు. కేసుకు సంబంధించిన తదుపరి న్యాయపరమైన చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## టి–సేవ ఆన్ లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ



హైదరాబాద్, జూలై 16: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత సంస్థ టి–సేవ ఆన్ లైన్ స్కిల్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టి–సేవ ఆన్ లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడప వెంకట్ రెడ్డి తెలిపారు. స్కిల్ కేంద్రాల ద్వారా వెయ్యికి పైగా స్కిల్ డెవలప్ మెంట్ కోర్సుల్లో ఆన్ లైన్ శిక్షణ, వివిధ ఆన్ లైన్ సేవలు వినియోగదారులకు అందించడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చునని ఆయన సూచించారు. బస్సు, ట్రైన్, విమాన టికెట్స్ బుకింగ్, వివిధ బ్యాంకుల ద్వారా మనీ ట్రాన్స్ఫర్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు, క్యాష్ డిపోసిట్స్, హెల్త్, బైక్ అండ్ కార్ ఇన్సూరెన్స్, బిల్లుల చెల్లింపులు, కొత్త పాన్ కార్డుల అప్లై, కరెక్షన్స్ చేయవచ్చని ఆయన తెలిపారు. వివరాలకు సెల్: 8179955744, వెబ్సైట్: www.tsevaonline.com ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## సంత్ గురు రవిదాస్ జయంతి ఉత్సవాల కో ఆర్డినేషన్ కమిటీ

### బీజేపీ జాయింట్ కన్వీనర్ గా మానేకర్ చంద్రుబాబా



హైదరాబాద్, జూలై 16: మహనీయుల జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర స్థాయిలో బీజేపీ పార్టీ కో ఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా సంత్ గురు రవిదాస్ జయంతి ఉత్సవాల కో ఆర్డినేషన్ కమిటీని ఆ పార్టీ ప్రకటించింది. ఉత్సవ కమిటీ కన్వీనర్ గా నల్గొండ జిల్లాకు చెందిన మాస శ్రీనివాస్, జాయింట్ కన్వీనర్ గా హైదరాబాద్ సెంట్రల్ జిల్లాకు చెందిన మానేకర్ చంద్రుబాబాను నియమిస్తూ పార్టీ ఆధిష్టానం ఆదేశాలు జారి చేసింది. ఈ సందర్భంగా గురువారం బర్కత్ పుర లోని బీజేపీ నగర కార్యాలయంలో జాయింట్ కన్వీనర్ మానేకర్ చంద్రుబాబా మాట్లాడుతూ... సమాజంలో ఎంతటి దుర్మార్గుడైనా సంత్సంగ ప్రభావంతో సజ్జనుడవుతాడని విశ్వసించిన మహనీయుడు సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ అని అన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అలాంటి మహనీయుడి చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

## వర్షాల కోసం కొలనుగూడలో కప్పతల్లి ఆట..

### సమృద్ధిగా వర్షాలు కురవాలని మహిళల ప్రార్థనలు



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి కృష్ణ చారి జూలై16

కందుకూరు మండలం కొలనుగూడ గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు పుష్కలంగా పంటలు పండాలని ఆకాంక్షిస్తూ గ్రామ సర్పంచ్ గోరికల బీరప్ప ఆధ్వర్యంలో గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా కప్పతల్లి ఆట నిర్వహించారు.గ్రామమంతా తిరుగుతూ వర్షదేవునికి ప్రత్యేక ప్రార్థనలు చేసి,చెరువులు,కుంటలు నిండి వ్యవసాయం సాఫీగా సాగాలని కోరుకున్నారు.ప్రస్తుతం విత్తనాలు వేసే సమయం దాటిపోతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని మహిళలు తెలిపారు. వెంటనే మంచి వర్షాలు కురిసి రైతుల కష్టాలు తొలగి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు,చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయ ఆచారాన్ని కొనసాగిస్తూ వర్షాల కోసం ప్రార్థనలు నిర్వహించారు.

## జర్నలిస్టుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తాం

### ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

### మంత్రిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



హైదరాబాద్, జూలై 16:

రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్ బాబు ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి “టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ“ ని అందజేసింది.ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సంక్షేమ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు.దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి. రవికుమార్, పర్కాల సమ్మయ్య గౌడ్, చొల్లేటి బ్రహ్మచారి, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బోనాల జాతర ప్రారంభం భక్తజన సందోహంగా గోల్కొండ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే చారిత్రాత్మిక గోల్కొండ బోనాల జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది

. ఆషాడ మాసం సందర్భంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి బోనాన్ని గోల్కొండ కోటపై వెలసిన జగదాంబిక అమ్మవారికి కుమ్మరులు సమర్పించారు. సాంప్రదాయ బద్దంగా 11 బోనాలతో కోటకు చేరుకున్న భక్తులు అమ్మవారికి ఘనంగా మొక్కలు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి బంగారు బోనాన్ని అత్యంత భక్తి శ్రద్ధతో సమర్పించారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రులు కొండ సురేఖ పొన్నం ప్రభాకర్ పాల్గొని ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో విలసిల్లాలని వారు ఆకాంక్షించారు.

తొలి బోనం సమర్పణతో గోల్కొండ కోట పరిసర ప్రాంతాన్ని భక్తుల కొలహాలంతో శోభాయమానంగా మారాయి. జాతరను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో భారీ



ఏర్పాట్లు చేసింది. క్యూ లైన్ లో త్రాగునీరు భారీ భద్రత తో పాటు ట్రాఫిక్ ఆకాంక్షలను సైతం కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. కోట వైపు వచ్చే దారులన్నీ భక్తజన సందోహంగా మారడంతో గోల్కొండ కోట పరిసరాలు విలవిల మెరిసాయి

## డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు నిందితుడు ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్

## సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలి

### గవర్నర్‌ను కలిసేందుకు వెళ్లిన కేసులో కోర్టుకు హాజరు



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి విజయవాడ జూలై 16:

వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌పై నమోదైన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించడానికి వెళ్లిన సందర్భంగా, తమపై విజయవాడ పోలీసులు నమోదు చేసిన కేసులో నేడు విజయవాడ III అదనపు ప్రధాన న్యాయ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణకు హాజరయ్యామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షుడు డా. పిట్ట వరప్రసాద్ తెలిపారు.

ఈ కేసులో సీపీఐ, కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్)తో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు నిందితులుగా చేర్చబడ్డారు.

నేడు కోర్టులో వాయిదా విచారణ సందర్భంగా అందరూ హాజరై న్యాయ ప్రక్రియలో పాల్గొన్నారు.డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసు అత్యంత తీవ్రమైన నేరమని, ఇలాంటి కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి శాసన మండలి సభ్యుడిగా కొనసాగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. అందుకే గవర్నర్‌ను కలిసి ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరామని తెలిపారు.ప్రజాస్వామ్య పద్ధతిలో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లిన నాయకులపై కేసులు నమోదు చేయడం విచారకరమని, ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలను ఖండిస్తున్నామని వారు అన్నారు. కోర్టుపై తమకు పూర్తి గౌరవం ఉందని, న్యాయస్థానం ఇచ్చే ప్రతి ఆదేశాన్ని గౌరవిస్తూ న్యాయపోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీపీఐ, కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు కోర్టుకు హాజరయ్యారు.

## 8 మంది అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి.. నియామక పత్రాల పంపిణీ

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి కృష్ణ చారి జూలై16

రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పలువురు అంగన్వాడీ హెల్పర్లకు పదోన్నతులు కల్పించే కార్యక్రమం గురువారం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అడిషనల్ కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి చేతుల మీదుగా 8 మంది అంగన్వాడీ హెల్పర్లకు అంగన్వాడీ టీచర్లుగా నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి జి.శాంతిశ్రీ మాట్లాడుతూ,పదోన్నతి పొందిన టీచర్లు చిన్నారుల విద్య,పోషణ,సంక్షేమ కార్యక్రమాల అమలులో మరింత బాధ్యతాయుతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓలు ఎల్.శాంతిరేఖ,ఎస్. రేణుక,పి.ఉదయ పాల్గొని పదోన్నతి పొందిన అంగన్వాడీ టీచర్లకు శుభాకాంక్షలు తెలిపారు



## “భాగ్యలత కాలనీలో రెపరెపలాడిన తెలంగాణ రక్షణ సేన జెండా ప్రజా పోరాటాలకు నాంది పలికిన సునీత రెడ్డి!“

– తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత పిలుపు మేరకు పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తాం

– భాగ్యలత కాలనీలో ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ.

– సునీత రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతర పోరాటానికి పిలుపు.

– ప్రతి కాలనీలో పార్టీ నీ బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచన.

– పలువురు నాయకులు, కార్యకర్తల భారీ పాల్గొనిక

– ప్రజల హక్కుల పరిరక్షణే తెలంగాణ రాష్ట్ర సేన ప్రధాన ధ్యేయమని స్పష్టం.

హైద్రాబాద్ ఎస్టేట్ హయత్‌నగర్, ప్రతినిధి:

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యలత కాలనీ ఆదివారం తెలంగాణ రక్షణ సేన జెండా రెపరెపలతో మార్మోగింది. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రక్షణ సేన నాయకురాలు సునీత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా సునీత రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనతో ప్రజల ఆశయాలు పూర్తిగా నెరవేరలేదని, ఇంకా అనేక ప్రాంతాల్లో ప్రజలు మౌలిక సదుపాయాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాంటి సమస్యలను గుర్తించి ప్రజల తరఫున ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, బాధితులకు అండగా నిలవడం, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు భద్రత, సామాజిక న్యాయం కోసం పోరాడడమే తెలంగాణ రక్షణ సేన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రతి కాలనీ, ప్రతి డివిజన్‌లో సంస్థను మరింత బలోపేతం చేసి ప్రజా ఉద్యమాలను విస్తృతం చేయాలని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి నాయకుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ధైర్యంగా ప్రశ్నిస్తూ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో నాయకులు నరేష్ ప్రజాపతి, శివారెడ్డి కంచర్ల, కోళ్ల శ్రీనివాస్, పోలే ప్రదీప్, బ్లెస్సో శామ్యూల్, ఇమనెల్, మంజుల, సోనూ భాయ్, పిట్టల రాజు, సురేందర్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రక్షణ సేన జెండాకు వందనం చేసి సంస్థ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించే ప్రజా వేదికగా తెలంగాణ రక్షణ సేన నిలుస్తుందని అన్నారు. యువతను సామాజిక సేవ వైపు నడిపిస్తూ ప్రజా చైతన్యాన్ని పెంపొందించేందుకు సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.జెండా ఆవిష్కరణ అనంతరం నాయకులు, కార్యకర్తలు పరస్పరం అభినందనలు తెలుపుకొని







పార్టీ విస్తరణపై చర్చించారు. హయత్‌నగర్ ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలని నిర్ణయించారు. కార్యక్రమం ఉత్సాహభరిత నినాదాల మధ్య విజయవంతంగా ముగిసింది.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# అక్రమ మట్టి రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

## జేసీబీ, రెండు ట్రాక్టర్లు సీజ్.. డ్రైవర్లపై కేసు నమోదు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌హెచ్‌ఓ హెచ్చరిక

గీసుగొండ, జూలై 16 హైదరాబాద్ ఎస్టేట్: అక్రమ మట్టి రవాణాపై గీసుగొండ పోలీసులు ఉక్కుపాదం మోపారు. మండలంలోని ఊకల్ గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసి, వాటి డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. అక్రమ మట్టి రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గీసుగొండ ఎస్‌హెచ్‌ఓ డి. విశ్వేశ్వర్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తవ్వకం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అక్రమ మట్టి తవ్వకం, రవాణాకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.



# యాచారం పిఎస్ లో లాయర్ పై దుర్భాషలాడిన ఎస్ఐ మధు





హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 16

రంగారెడ్డి జిల్లాయాచారం మండలం న్యాయవాదికిషన్ రాత్ చౌహన్ తోటి న్యాయవాదులు కలిసి ఎస్ఐ మధు పైన కేసు వేయడం జరిగినది క్రైమ్ నెంబర్ 150 ఆఫ్ 20 26 లో ఎస్సై రిలీజ్ ప్రాపర్టీ విషయంలో ఎస్ ఐ ప్రియాంకకు కంప్లైంట్ ఇవ్వడం జరిగింది ఎస్ ఐ ప్రియాంక డిలీట్ చేయడం జరిగింది డిలీట్ ఎందుకు చేసావు అని లాయర్ గారు అడిగితే ఎస్ఐ మధు దుర్భాషలాడడం జరిగింది అడ్వకేట్ ప్రొడక్షన్ ఆక్టివ్ ఉన్న లాయర్ ను బయటకు తోయడం జరిగింది

తోసి వేయడంతో తోటి లాయరు కమిషనర్ ఆఫీస్ లో ఎస్ఐ మధు మీద కేసు పెట్టడం జరిగింది

# నాణ్యమైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు: హన్మకొండ కలెక్టర్

## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన చాహత్ బాజ్ పాయి

## విద్యార్థినులతో కలిసి అల్పాహారం.. భోజన నాణ్యతపై ఆరా

హనుమకొండ, జూలై 16 హైదరాబాద్ ఎస్టేట్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ప్రణాళికాబద్ధంగా బోధన కొనసాగించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. ప్రతి విద్యార్థినికి పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధించడంతో పాటు నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గురువారం వడ్డేపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ విద్యాబోధన, మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం, అల్పాహారం, మధ్యాహ్న భోజన నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న మైసూర్ బోండాను తనిఖీ చేసి వారితో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం భోజనం నాణ్యత, రుచి, మెనూ గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకుని, పరిశుభ్రమైన, పోషకాహార ప్రమాణాలతో కూడిన ఆహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని





ఆదేశించారు. అనంతరం ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సుల విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమైన కలెక్టర్ తరగతి గదులను సందర్శించి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి విద్యార్థినుల అవగాహనను పరిశీలించారు. వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు క్రమశిక్షణతో చదవాలని, అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు కూడా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచగలరని కలెక్టర్ అన్నారు. ఆ దిశగా నీట్, జేఈఈ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థినులను సిద్ధం చేయడంలో అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అజ్మీర గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# బూత్ ఇన్చార్జిలు, కో కస్టర్డ్ సమావేశం...

## రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర

పట్టణంలోని గవరపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 81 వ డివిజన్ ముఖ్య నాయకులు,కో క్లస్టర్ లు,బూత్ ఇంచార్జ్ లు సమావేశం 81 టీడీపీ ఇంచార్జ్,ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళా సురేంద్ర ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ సర్ ప్రక్రియ ను ఈనెల 24 వరకు గడువు పెంచడం హర్షించదగ్గ విషయమై సర్ ప్రక్రియ ఇచ్చిన గడువులోగా పూర్తిచేయ్యాలని తెలుగుదేశం పార్టీ నాయకులు ను బి ఎల్ ఎ లను ఆదేశించారు.

ఈ సందర్బంగా ఆయన వర్చువల్ గా పాల్గొని అనంతరం టెలికాన్ఫరెన్స్ ద్వారా టీడీపీ శ్రేణులతో మాట్లాడిన ఆయన సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొన్నాలనీ,అర్హత కలిగిన

ఒక్క ఓటు కూడా పోవడానికి వీలు లేదు అని అన్నారు.మళ్ళా సురేంద్ర మరియు టీడీపీ పరిశీలకులు వరసిద్ధి అనంత్ లక్ష్మి మాటలాడతూ ప్రతి ఒక్కరు ప్రభుత్వం సర్ ప్రక్రియ ను మరో పది రోజుల పొడిగించారు కాబట్టి అర్వత ఉన్న ఏ ఒక్క వోట్ పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అనంతరం 81 డివిజన్ సచివాలయం





లో అన్ని బూత్ లో సర్ ప్రక్రియ ఎంత వరకు పూర్తి అయ్యిందో బీ ఎల్ ఓ లు ని అడిగి తెలుసుకున్నారు,ఈ పది రోజుల్లో 100 శాతం పూర్తి చేయాలని తెలియజేశారు.ఇప్పుడు వరకు సర్ ప్రక్రియ బాగా నిర్వహిస్తున్నందుకు బీ ఎల్ ఓ లు ను,బీ ల్ ఏ లు ను అభినందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ,బొలిశెట్టి శ్రీనివాసరావు,వెదుళ్ల సూర్యప్రభ,దాడి వాసు,తణుకు రవి,సాలపు నాయుడు,మల్ల సూరిబాబు,పీలా రమణారావు,వానపల్లి కోటేశ్వరావు,ఎండకుర్తి అప్పలరాజు,జామి రాజు,అనకాపల్లి రాము,ఎండపల్లి శేఖర్,వేగి సూరిబాబు,దొడ్డి రామ గోవింద్,పవన్,రామోజీ శ్యామ్ సుందర్,చిన్నారావు ,ఆళ్ల రవికుమార్.,నంద్యాల గణేష్,తదితరులు పాల్గొన్నారు.

# బోనాల నిధుల్లో జల్‌పల్లికి మొండిచేయి..

## వెంటనే నిధులు విడుదల చేయాలి: బీజేపీ



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి కృష్ణ చారి జూలై16

ఆషాఢ బోనాల జాతర నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలోని దేవాలయాల అభివృద్ధి పనుల్లో శంషాబాద్ జోన్, జల్‌పల్లి సర్కిల్‌కు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీజేపీ నాయకులు పెరమోని నరేష్ యాదవ్, గుర్జని గణేష్ గౌడ్, ఎండీ నయీమ్ అడ్వకేట్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బోనాల ఉత్సవాల కోసం సుమారు 3,000 దేవాలయాల అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించినప్పటికీ, జల్‌పల్లి సర్కిల్‌లోని ఆలయాలను అధికారులు పూర్తిగా విస్మరించారని విమర్శించారు.చార్మినార్, రాజేంద్రనగర్ జోన్లలో ఇప్పటికే పనులు ప్రారంభమైనా,శంషాబాద్ జోన్‌కు నిధులు కేటాయించకపోవడం వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు.జల్‌పల్లి,మామిడిపల్లి,శ్రీరామ్ కాలనీ,పహాడిషరీఫ్,కొత్తపేట్,ఎర్రకుంట తదితర ప్రాంతాల దేవాలయాల వద్ద యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించి,వెంటనే నిధులు విడుదల చేసి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో భక్తులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# విద్యార్థులకు మెరుగైన వసతులే లక్ష్యం..

## జన్వాడ పాఠశాలను సందర్శించిన సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి కృష్ణ చారి జులై 16

మహేశ్వరం నియోజకవర్గంలోని జన్వాడ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు.కే.టి.రామారావు చొరవతో పాఠశాల అభివృద్ధి కోసం చేపట్టిన పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న ఆమె,పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం,ఆధునిక మౌలిక వసతులు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు కే.టి.రామారావు చొరవతో సిఎస్ఆర్ నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయమని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యుత్ లైన్ మెన్ శ్రీనివాసులుకు కన్నీటి వీడ్కోలు




చారకొండ, జూలై 16: చారకొండ మండలం జేపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ లైన్ మెన్ మల్లెపాకుల శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన పార్థివదేహాన్ని సందర్శించడానికి బుధ వారం పలువురు విద్యుత్ శాఖ ఉద్యోగులు, పలువురు రాజకీయ నాయకులు యువత, గ్రామ ప్రజ లు పెద్ద ఎత్తున తరలి వచ్చి నివా ళులు అర్పించి, కట్టతడిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన పట్ల తమకున్న అభిమానాన్ని గుర్తుచేసుకొంటూ కన్నీటి పర్యంతం అయ్యా రు. గ్రామప్రజలు, పలువురు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. అంగరంగ వైభవంగా డబ్బు చప్పులతో ప్రజానీకం ఊరేగింపుగా కుటుంబానికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో కుమారుడు వంశీ, ఆయన కుటుంబ సభ్యులు సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు జరిపారు.

# ఎంపీ వద్దిరాజుకు ఘన సన్మానం



వరంగల్, జులై 16 హైదరాబాద్ ఎస్టేట్:

రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేతగా, పార్లమెంటరీ పార్టీ లీడర్‌గా నియమితులైన ఎంపీ వద్దిరాజు రవిచంద్రను తూర్పు యువసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ నగరానికి చెందిన గుడిశాల రాజు, విక్రమ్, ఏరుకొండ వినయ్, జనగాం మణి తదితరులు ఎంపీ వద్దిరాజుకు భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి, రాజ్యసభలో పార్టీ తరఫున సమర్థవంతమైన నాయకత్వం అందిస్తూ ప్రజా సమస్యలను సమర్థంగా ప్రస్తావించాలని ఆకాంక్షించారు. అనంతరం ఖైరతాబాద్ బీఆర్ఎస్ నాయకులు సూర్య విష్ణు, పి. శ్రీరామ్ తదితరులు ఎంపీ వద్దిరాజును శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తూ పార్టీ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు అప్పగించిన నూతన బాధ్యతలు పార్టీ నాయకత్వం ఆయనపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాజ్యసభలో పార్టీ అభిప్రాయాలను సమర్థవంతంగా వినిపిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేయాలని ఆకాంక్షిస్తూ మరోసారి అభినందనలు తెలిపారు.

RNI No Tel / 2012 /4241 ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక hyderabadestate.co.in
17 శుక్రవారం జూలై 2026

## నెలాఖరులోగా రేషన్ కార్డుదారులందరూ ఈ-కేవైసీ పూర్తి చేయాలి



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి కృష్ణ చారి జూలై 16
రంగారెడ్డి జిల్లాలోని అన్ని రేషన్ కార్డులలో నమోదైన కుటుంబ సభ్యులందరూ ఈ నెలాఖరులోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ (ఈ-కేవైసీ) ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి విజ్ఞప్తి చేశారు.జిల్లాలో పలుచోట్ల రేషన్ కార్డుల్లో ఒకరు లేదా ఇద్దరు సభ్యులు మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేయగా,మిగిలిన కుటుంబ సభ్యులు ఇంకా పూర్తి చేయని విషయం గుర్తించినట్లు తెలిపారు.దీంతో ప్రతి కుటుంబ సభ్యుడు తమకు కేటాయించిన చౌకధరల దుకాణం (ఎఫ్.పి.ఎస్)కు వెళ్లి బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలని సూచించారు.ఈ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా రేషన్ కార్డులో నమోదైన కుటుంబ సభ్యుల వివరాలు ధ్రువీకరించబడతాయని,ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు నిరంతరాయంగా అందుకోవడానికి ఇది తప్పనిసరి అని అధికారులు తెలిపారు.మరిన్ని వివరాల కోసం సంబంధిత చౌకధరల దుకాణం లేదా మండల పౌర సరఫరాల అధికారులను సంప్రదించాలని సూచించారు.

## కేసీఆర్ గారిపై కక్షతో యావత్ తెలంగాణను కరువు కోరల్లోకి నెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి దేవరకొండ
మాజీ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారిపై రాజకీయ కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తోందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు శ్రీ రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు.ఒకవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా గోదావరి బేసిన్‌కు చెందిన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని, మరోవైపు కన్నెపల్లి వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ పంపులను ప్రారంభించి అవసరమైన నీటిని ప్రాజెక్టులకు తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటి పంపింగ్‌ను ప్రారంభించి, గోదావరి బేసిన్ ప్రాజెక్టులను నింపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.తెలంగాణ ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ కక్ష సాధింపుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయన ఆరోపించారు.

## సర్ ప్రక్రియ ను ఈనెల 24 వరకు గడువు

### – రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ,మంత్రివర్యులు నారా లోకేష్ , టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జుల ఆధ్వర్యంలో ప్రతీ నెల మూడవ బుధవారం అనకాపల్లి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ వర్చువల్ గా కార్యకర్తల వివిధ సమస్యలపై మాట్లాడారు .ఈ సందర్భంగా ఆయన వర్చువల్ గా పాల్గొని అనంతరం టెలికాన్ఫరెన్స్ ద్వారా టీడీపీ శ్రేణులతో మాట్లాడిన ఆయన సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొన్నాలనీ,అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా పోవడానికి వీలు లేదు అని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రేణులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## “భాగ్యలత కాలనీలో రెపరెపలాడిన తెలంగాణ రక్షణ సేన జెండా ప్రజా పోరాటాలకు నాంది పలికిన సునీత రెడ్డి!“

### – తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత పిలుపు మేరకు పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తాం
### – భాగ్యలత కాలనీలో ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ.
### – సునీత రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతర పోరాటానికి పిలుపు.
### – ప్రతి కాలనీలో పార్టీ నీ బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచన.
### – పలువురు నాయకులు, కార్యకర్తల భారీ పాల్గొనిక
### – ప్రజల హక్కుల పరిరక్షణే తెలంగాణ రక్షణ సేన ప్రధాన ధ్యేయమని స్పష్టం.

హైద్రాబాద్ ఎస్టేట్ హయత్‌నగర్, ప్రతినిధి:
హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యలత కాలనీ శుక్రవారం తెలంగాణ రక్షణ సేన జెండా రెపరెపలతో మార్మోగింది. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రక్షణ సేన నాయకురాలు సునీత రెడ్డి హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా సునీత రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనతో ప్రజల ఆశయాలు పూర్తిగా నెరవేరలేదని, ఇంకా అనేక ప్రాంతాల్లో ప్రజలు మౌలిక సదుపాయాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాంటి సమస్యలను గుర్తించి ప్రజల తరఫున ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, బాధితులకు అండగా నిలవడం, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు భద్రత, సామాజిక న్యాయం కోసం పోరాడడమే తెలంగాణ రక్షణ సేన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి కాలనీ, ప్రతి డివిజన్‌లో సంస్థను మరింత బలోపేతం చేసి ప్రజా ఉద్యమాలను విస్తృతం చేయాలని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి నాయకుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ధైర్యంగా ప్రశ్నిస్తూ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో నాయకులు నరేష్ ప్రజాపతి, శివారెడ్డి కంచర్ల, కోళ్ల శ్రీనివాస్, పోలే ప్రదీప్, బ్లెస్సో శామ్యూల్, ఇమనెల్, మంజుల, సోనూ భాయ్,



పిట్టల రాజు, సురేందర్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రక్షణ సేన జెండాకు వందనం చేసి సంస్థ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించే ప్రజా వేదికగా తెలంగాణ రక్షణ సేన నిలుస్తుందని అన్నారు. యువతను సామాజిక సేవ వైపు నడిపిస్తూ ప్రజా చైతన్యాన్ని పెంపొందించేందుకు సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం



సంబంధిత అధికారులతో నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.జెండా ఆవిష్కరణ అనంతరం నాయకులు, కార్యకర్తలు పరస్పరం అభినందనలు తెలుపుకొని పార్టీ విస్తరణపై చర్చించారు. హయత్‌నగర్ ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలని నిర్ణయించారు. కార్యక్రమం ఉత్సాహభరిత నినాదాల మధ్య విజయవంతంగా ముగిసింది.

## డిజైన్ థింకింగ్ , మేధో సంపత్తి హక్కులపై అవగాహన సదస్సు

దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్), అనకాపల్లిలోని డైట్ ఏసీఎం స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో, ఏసీఎం ఇండియా కార్యాచరణ నిధుల (ఏబీఎఫ్) సహకారంతో డిజైన్ థింకింగ్ మరియు మేధో సంపత్తి హక్కులు అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది.
ఈ కార్యక్రమంలో డాక్టర్ భవ్య మంజీర, డిజైన్ థింకింగ్ కోచ్, ఆవిష్కరణల వ్యూహకర్త, జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్‌డీసీ) విశాఖపట్నం ఇన్‌చార్జ్, అలాగే శ్రీ జి. సంతన్ కుమార్, జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ జూనియర్ అసిస్టెంట్ మేనేజర్, డిజైన్ థింకింగ్ కోచ్ మరియు ఆవిష్కరణల వ్యూహకర్త ముఖ్య వక్తలుగా పాల్గొని విద్యార్థులకు విలువైన మార్గదర్శనం చేశారు.
ఈ సదస్సులో ఏసీఎం స్టూడెంట్ చాప్టర్ సభ్యులు, అధ్యాపకులు మరియు వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం, పరిశోధనా దృక్పథాన్ని అభివృద్ధి చేయడం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడం, మేధో సంపత్తి హక్కుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వహించబడింది.
సదస్సులో సమస్యలను గుర్తించి వినూత్న



పరిష్కారాలను రూపొందించే విధానాలు, సృజనాత్మక ఆలోచనల రూపకల్పన, నమూనా అభివృద్ధి, కొత్త ఉత్పత్తుల రూపకల్పన, పేటెంట్లు, కాపీరైట్లు, ట్రేడ్‌మార్క్‌లు, పరిశ్రమల్లో మేధో సంపత్తి హక్కుల ప్రాధాన్యం, ఆవిష్కరణలకు చట్టపరమైన రక్షణ వంటి అంశాలను నిపుణులు సమగ్రంగా వివరించారు.
ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. కె. సుజాత మాట్లాడుతూ, విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలను అభివృద్ధి చేసుకుని, వాటిని పేటెంట్లు మరియు ఆవిష్కరణలుగా మలచుకోవాలని సూచించారు.
డీన్ (అడ్మినిస్ట్రేషన్) డా. కె. ఈశ్వరరావు మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో డిజైన్ థింకింగ్ మరియు మేధో సంపత్తి హక్కులపై




అవగాహన ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని, ఇటువంటి కార్యక్రమాలు వారి సృజనాత్మకతను, ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంపొందించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్. వైకుంఠరావు మాట్లాడుతూ, ఇటువంటి సదస్సులు విద్యార్థులలో పరిశోధన దృక్పథాన్ని పెంపొందించి, భవిష్యత్‌లో సాంకేతిక రంగంలో విజయవంతమైన ఆవిష్కర్తలుగా ఎదగడానికి దోహదపడతాయని తెలిపారు.

## స్వచ్ఛతా పఖ్వాడా ముగింపు వేడుక ఘనంగా కొబ్బరి తోట ప్రారంభించిన ఐ ఐ పి ఈ డైరెక్టర్







భారతీయ పెట్రోలియం మరియు ఇంధన సంస్థ (ఐ ఐ పి ఈ ) ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా పఖ్వాడా2026 ముగింపు వేడుక బుధవారం సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఐ ఐ పి ఈ డైరెక్టర్ ప్రొఫెసర్ షాలివాహన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ,స్వచ్ఛత ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు.పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాదిగా నిలుస్తాయన్నారు.
కార్యక్రమానికి ముందు స్వచ్ఛతా పఖ్వాడా బృందం అభివృద్ధి చేసిన కొబ్బరి తోట (కోకో నెట్ గార్డెన్ )ను ఆయన ప్రారంభించారు, పర్యావరణ పరిరక్షణకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.ఇపే ఐ ఐ పి ఈ రిజిస్ట్రార్ రామ్‌ఫోల్ ద్వివేది మాట్లాడుతూ, స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. నోడల్ అధికారి డా. బి. మురళీకృష్ణ పక్షవాడా సందర్భంగా మొక్కల నాటడం, అవగాహన కార్యక్రమాలు, పోటీలు, పరిశుభ్రత కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐ ఐ పి ఈ అధ్యాపకులు, సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాళ్లు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
17 శుక్రవారం జూలై 2026

## డబ్బుల కోసమే సినిమాల్లోకి వచ్చా.. ఒకప్పుడు కూలీ పని కూడా చేశా : విజయ్ సేతుపతి

సినిమా పరిశ్రమలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా, కేవలం తన అద్భుత నటనతో 'మక్కల్ సెల్వన్' (ప్రజల నటుడు)గా ఎదిగిన విజయ్ సేతుపతి.. తమిళ, తెలుగు ప్రేక్షకులలో సంపాదించుకున్న గుర్తింపు ప్రత్యేకమైనది. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో ఆయన తన చిన్ననాటి కష్టాలు, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల గురించి పంచుకున్న విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి."చిన్నప్పుడు మా కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేది. మా నాన్న మా కోసమే చాలా అప్పులు చేశారు. అవి తీర్చలేక సతమతమయ్యేవాళ్లం. కొన్నిసార్లు అప్పులవాళ్లు మా ఇంటిపైకి గొడవకు వచ్చేవారు. ఆ సమయంలో మా నాన్న ఒంటరిగా బాధపడకూడదని నేను ఎప్పుడూ ఆయన పక్కనే కూర్చునేవాడిని" అని సేతుపతి గుర్తుచేసుకున్నారు.ఎన్ని కష్టాలున్నా ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు నాన్న బుల్లెట్ బండిపై వస్తూ ఫ్రైడ్ రైస్ తెచ్చేవారని, కుటుంబమంతా కలిసి దాన్ని పంచుకుని తినే ఆ క్షణాలు తన జీవితంలో మర్చిపోలేని మధుర జ్ఞాపకాలని చెప్పారు.

నటుడు అవ్వాలనేది విజయ్ సేతుపతి లక్ష్యం కాదట. కేవలం కుటుంబ బాధ్యతలు, డబ్బుల కోసమే ఆయన రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టారు. సినిమాల్లోకి రాకముందు ఆయన స్కూల్ రోజుల్లో కూలీ పనికి వెళ్లారు. ఆ తర్వాత రిటైల్ స్టోర్‌లో సేల్స్‌మ్యాన్‌గా, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో క్యాషియర్‌గా, ఫోన్ బూత్ ఆపరేటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత దుబాయ్ వెళ్ళి అక్కడ అకౌంటెంట్‌గానూ ఉద్యోగం చేశారు.దుబాయ్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత నాటక రంగానికి చెందినవారితో ఏర్పడిన పరిచయమే విజయ్ సేతుపతి జీవితాన్ని మలుపు తిప్పింది. మొదట్లో సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లు చేస్తూ..



'తెన్మేర్కు పరువకాట్రు' చిత్రంతో హీరోగా మారారు. ఆ తర్వాత 'సూదు కవ్వమ్', 'విక్రమ్ వేద', 'పిజ్జా', 'మహారాజా' వంటి విలక్షణమైన చిత్రాలతో స్టార్ హీరోగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా నటించిన 'ట్రైన్', 'స్లమ్ డాగ్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

## యుద్ధభూమిలో ప్రభాస్.. 'ఫౌజీ' విడుదల తేదీ వచ్చేసింది!

ప్రభాస్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'ఫౌజీ' సినిమా విడుదల తేదీ ఖరారైంది. ఒక పోస్టర్‌తోనే సినిమాపై అంచనాలను మరింత పెంచేశారు. యుద్ధభూమి నేపథ్యాన్ని చూపించిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.చిత్ర బృందం ప్రకటించిన వివరాల ప్రకారం 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా 2026 డిసెంబర్ 3న విడుదల కానుంది. ప్రభాస్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ప్రభాస్‌కు సంబంధించిన కొంత షూటింగ్ మాత్రమే మిగిలి ఉండగా, నిర్ణయించిన తేదీకే సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది.కొత్త పోస్టర్‌లో ప్రభాస్ పూర్తిగా భిన్నమైన లుక్‌లో కనిపించారు. వర్షంలో తడిసిపోయి, రక్తపు మరకలతో, గాయాలతో యుద్ధభూమి మధ్య కూర్చున్న ఆయన చేతిలో తుపాకీ కనిపిస్తోంది. చుట్టూ మృతదేహాలు, శిథిలాలు కనిపించేలా పోస్టర్‌ను డిజైన్ చేశారు. 'ఒంటరిగా పోరాడే ఓ బెటాలియన్' అనే ట్యాగ్‌లైన్‌తో కథ యుద్ధం, త్యాగం, ధైర్యం చుట్టూ తిరగబోతుందనే సంకేతాలు ఇచ్చారు.పోస్టర్‌లో 'ఫౌజీ' టైటిల్‌ను ఎరుపు రంగులో ప్రత్యేకంగా చూపించారు. చారిత్రక నేపథ్యాన్ని సూచించేలా పాత ముద్రలు, సంఖ్యలు, చేతిరాత తరహా డిజైన్‌లను ఉపయోగించారు. దీంతో సినిమా ఏ కాలంలో సాగుతుందనే ఆసక్తి మరింత పెరిగింది. అయితే కథకు సంబంధించిన పూర్తి వివరాలను చిత్ర బృందం ఇంకా వెల్లడించలేదు.ఈ చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రభాస్‌తో ఆయన చేస్తున్న తొలి సినిమా ఇదే. ఇమాన్వీ, మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. విడుదల తేదీ పోస్టుకు కొన్ని నిమిషాల్లోనే వేలాది లైక్‌లు, కామెంట్లు వచ్చాయి. ప్రభాస్ కొత్త అవతారం,




సినిమా నిర్మాణ స్థాయిపై అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.

## పొట్టి నిక్కర్లో బాలయ్య బ్యూటీ సెగలు!

అఖండ సినిమాలో కలెక్టర్ పాత్రతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ప్రగ్యా జైస్వాల్ వరుసగా సినిమాలు చేస్తోంది కానీ స్టార్ హీరోయిన్ రేంజ్ లో ఈమధ్య అవకాశాలు అందుకోలేదని చెప్పాలి. ముఖ్యంగా టాలీవుడ్ మొదలు బాలీవుడ్ వరకు ఎన్నో సినిమాలలో చేసినప్పటికీ.. సరైన క్రేజ్ లేకపోవడం గమనార్హం. ఎలాగైనా సరే మంచి హిట్ అందుకోవాలని ప్రయత్నాలు చేస్తున్న ఈమె మరొకవైపు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ రోజుకొక ట్రెండీ అవుట్ ఫిట్ తో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తోంది. పొట్టి నిక్కర్ లో చెమటలు పట్టించిన ప్రగ్యా జైస్వాల్.. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ లో గ్లామర్ కి కొదవ లేకుండా రోజుకొక అవుట్ ఫిట్ తో అటు ప్రేక్షకులను ఇటు నెటిజన్ లను అలరించే ఈమె.. తాజాగా పొట్టి నిక్కర్లో బికినీను తలపించేలా డ్రెస్ ధరించి అందాలు ఆరబోసింది. క్రీమ్ కలర్ లేస్ తో డిజైన్ చేసిన స్లీవ్ లెస్ మినీ క్రాప్ టాప్ ధరించిన ఈమె దీనికి కాంబినేషన్లో బాటమ్ వైట్ డెనిమ్ షార్ట్ ధరించి ఫోజులిచ్చింది. తన లుక్కును ఫుల్ ఫిల్ చేసుకోవడానికి వైట్ షర్ట్ ను ధరించిన ఈమె.. చేతుల వరకు మాత్రమే ధరించి మరో ఫ్యాషన్ ట్రెండ్ కి పునాది వేసింది. అలా మొత్తానికైతే ఈమె ధరించిన ఈ ట్రెండీ ఔట్ ఫిట్ యువతను విపరీతంగా అలరిస్తోంది. లా స్కూల్ నుండీ నటనారంగం వైపు.. ప్రగ్యా జైస్వాల్ మధ్యప్రదేశ్లోని జబల్పూర్లో జన్మించింది. ఇక పూణేలోని సింహయాసిస్ లా స్కూల్లో విద్యను అభ్యసించిన ఈమె సింబయాసిస్ విశ్వవిద్యాలయంలో చదివే రోజుల్లోనే వివిధ రకాల



అందాల పోటీల్లో పాల్గొని సక్సెస్ఫుల్ మోడల్ గా ఎదిగింది .2008 ఫెమినా మిస్ ఇండియా పోటీలలో మిస్ ఎర్త్, మిస్ డాన్సింగ్ క్వీన్ వంటి టైటిల్స్ అందుకున్న ఈమె ఇటు పలు బ్రాండ్స్ కి అంబాసిడర్ గా కూడా వ్యవహరించింది. మిలీనియం హైపర్ మార్కెట్ ఫర్ దుబాయ్, ఎఫ్ బీ బీ , రిలయన్స్ డిజిటల్, డాబర్ వాటిక, డవ్ వంటి ఎన్నో పాపులర్ బ్రాండ్స్ కి పనిచేసింది. ఎన్నో అభిరుచు లు కూడా.. సినిమా మీద ఇష్టంతో మిర్చి లాంటి కుర్రాడు అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈమె ఆ తర్వాత పనిచేసిన కంచె సినిమాతో నటిగా తనను తాను ప్రూవ్ చేసుకుంది.. ఇక బాలకృష్ణ నటించిన అఖండ, డాకూ మహారాజ్ సినిమాలలో నటించి మరింత క్రేజ్ సొంతం చేసుకుంది ప్రగ్యా జైస్వాల్. ఇక ఈమెకు నృత్యం అంటే చాలా ఇష్టం. అంతేకాదు మంచి గాయని కూడా.. ప్రముఖ స్టార్ హీరోలు చిరంజీవి, అల్లు అర్జున్ , నాగార్జున అంటే ప్రత్యేక



అభిమానం.. అలాగే ఇష్టమైన హీరోయిన్స్ విషయానికి వస్తే అనుష్క, మాధురి దీక్షిత్ లను ఈమె ఎక్కువగా ఆరాధిస్తూ ఉంటుంది. పైగా నలుపు, తెలుపు, ఎరుపు అంటే చాలా ఇష్టపడే ఈమె.. లండన్ తన ఫేవరెట్ డెస్టినేషన్ గా చెబుతూ ఉంటుంది.

## నోలన్ 'ది ఒడిస్సీ' సినిమాకు వెళుతున్నారా? అరగంట ముందే థియేటర్‌కు చేరుకోండి!




ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన 'ది ఒడిస్సీ' చిత్రం కోసం సినీ ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం శుక్రవారం (జులై 17) విడుదల కానుంది. అయితే, సినిమా వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులు, మరీ ముఖ్యంగా ఐమ్యాక్స్ స్క్రీన్‌లలో చూసేవారు, కనీసం 30 నిమిషాల ముందే థియేటర్లకు చేరుకోవాలని చిత్ర బృందం సూచించింది.ఈ చిత్రాన్ని సంపూర్ణంగా అధునాతన ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించారు. ప్రేక్షకులకు అద్భుతమైన దృశ్యానుభూతిని అందించే క్రమంలో, కొన్ని ఎంపిక చేసిన ఐమ్యాక్స్ 70ఎంఎం స్క్రీనింగ్‌లలో ప్రధాన చిత్రం ప్రారంభానికి ముందు ప్రత్యేక కంటెంట్‌ను ప్రదర్శించే అవకాశం ఉంది. దీనిలో భాగంగా, డెనిస్ విల్లేనువే దర్శకత్వంలో రాబోతున్న 'డూన్: పార్ట్ త్రీ' చిత్రానికి సంబంధించిన నాలుగు నిమిషాల ప్రోలోగ్‌ను ప్రదర్శించవచ్చని ప్రచారం జరుగుతోంది. గతంలోనూ నోలన్ తన 'ది డార్క్ నైట్', 'ది డార్క్ నైట్ రైజెస్' చిత్రాల ప్రమోషన్ కోసం ఇదే తరహా వ్యూహాలనే అనుసరించడం గమనార్హం.సాధారణంగా భారీ చిత్రాల విడుదల సమయంలో తలెత్తే ట్రాఫిక్ ఇబ్బందులు, టికెట్ స్కానింగ్ ప్రక్రియ మరియు రద్దీగా ఉండే హాల్స్‌లో సీట్లను వెతుక్కోవడం వంటి కారణాల వల్ల ప్రేక్షకులకు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయం కంటే ముందుగానే థియేటర్‌లకు చేరుకోవడం ఉత్తమమని విశ్లేషకులు సూచిస్తున్నారు.కాగా, ఈ చిత్రాన్ని నోలన్ ఆశించిన పూర్తిస్థాయి ఐమ్యాక్స్ 70ఎంఎం ఫార్మాట్‌లో ప్రదర్శించే థియేటర్లు ప్రపంచవ్యాప్తంగా కేవలం 41 మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రారంభ వారాంతపు టిక్కెట్లు హాట్ కేకుల్లో అమ్ముడయ్యాయి. హోమర్ రచించిన గ్రీకు ఇతిహాసం 'ది ఒడిస్సీ' ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రధాన పాత్ర అయిన ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్ నటించగా, యాన్ హాత్వే, టామ్ హాలండ్, జెండాయా వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషించారు. సుమారు 2 గంటల 52 నిమిషాల నిడివి గల ఈ చిత్రంపై, లండన్ ప్రీమియర్ షో అనంతరం అద్భుతమైన సమీక్షలు వెలువడుతున్నాయి. సాంకేతికంగానూ, భావోద్వేగాల పరంగానూ సినిమా అత్యున్నత స్థాయిలో ఉందంటూ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## కష్టాలు లేనిది ఎవరికి?: నటుడు 'శుభలేఖ' సుధాకర్



'శుభలేఖ' సుధాకర్ .. విభిన్నమైన పాత్రలకు కెరాఫ్ అడ్రెస్ గా కనిపిస్తారు. ఇటు సినిమాలలోను .. అటు సీరియల్స్ లోను ఎన్నో విలక్షణమైన పాత్రలను పోషించి మెప్పించినవారాయన. తాజాగా ' సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "మొదటి నుంచి కూడా నటన అంటే చాలా ఇష్టంగా ఉండేది. అదే నన్ను సినిమాల వైపుకు నడిపించింది. 'శివ' సినిమా తరువాత చాలా గ్యాప్ వచ్చింది. ఆ సమయంలో నేను చాలా ఇబ్బందిపడ్డాను. ఏం చేయాలో .. ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి అది" అని అన్నారు."జీవితంలో కష్టాలు లేనివారంటూ ఎవరూ ఉండరు. ఎవరికి ఉండవలసిన కష్టాలు వారికి ఉంటూనే ఉంటాయి. అలా ఎన్నో కష్టాలను ఎదుర్కొని నిలబడ్డాను. అందువలన నాకు ఆకలి బాధ తెలుసు. ఎవరైనా ఆకలి అంటే.. సాయం చేయకుండా ఉండలేను. అలా ఎంతోమందికి సాయం చేసినవాడిని నేను. అయితే కొంతమంది దానిని అవకాశంగా తీసుకుంటున్నారని గ్రహించిన తరువాత, అవసరం ఏమిటనేది తెలుసుకున్న తరువాతనే సాయం చేయడం మొదలుపెట్టాను" అని చెప్పారు. 'ఒకానొక సమయంలో సినిమాలలో పూర్తిగా అవకాశాలు తగ్గినప్పుడు టీవీ సీరియల్స్ నాకు అన్నం పెట్టాయి. అందువలన నేను వాటితోనే బిజీ అయ్యాను. ఈ మధ్య కాలంలో మళ్లీ సినిమాలలో మంచి వేషాలు పడుతున్నాయి. అందుకు చాలా సంతోషంగా ఉంది. టీవీ .. సినిమా అనే వాటిని నేను వేరుగా చూడను. నటుడిగా ముందుకు వెళుతున్నానా లేదా అనేది మాత్రమే చూస్తాను. నేను భగవంతుడిని బలంగా నమ్ముతాను. మన ప్రయత్నం మంచిదైతే .. అందులో నిజాయితీ ఉంటే ఆయన సాయం తప్పకుండా అందుతుంది" అని అన్నారు.

## ఘనంగా సమంత సీమంతం..



ప్రముఖ నటి సమంత నివాసంలో సందడి నెలకొంది. త్వరలో తల్లి కాబోతున్న ఆమెకు మంగళవారం కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా సీమంతం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.సమంత, ఆమె భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరు తమ తొలి సంతానం కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. 2025 చివరిలో కోయంబత్తూరులో వీరి వివాహం జరగ్గా, ఈ ఏడాది డిసెంబర్‌లో సమంత బిడ్డకు జన్మనివ్వనున్నట్లు సమాచారం. ఈ వేడుకలో సమంత ఎంతో ఉల్లాసంగా, ప్రకాశవంతంగా కనిపించారు. కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఈ వేడుకలో తన అత్తగారితో ఆమె పంచుకున్న భావోద్వేగపూరిత క్షణాలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.గత జూన్ నెలలో 'మా ఇంటి బంగారం' చిత్ర విజయోత్సవ వేడుకలో సమంత బేబీ బంప్‌తో కనిపించడంతో ఆమె గర్భవతి అనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అనంతరం చిత్ర దర్శకుడు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అప్పటి నుంచి సమంత తన గర్భధారణకు సంబంధించిన విశేషాలను అప్పుడప్పుడు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఈ సీమంతం వేడుకపై సమంత దంపతులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ, సోషల్ మీడియా వేదికగా అభిమానులు, శ్రేయోభిలాషులు వారికి పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.







